క్లుప్తంగా

కులగణన సర్వేపై శిక్షణ



కులగణన సర్వే శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న విజయకుమారి

బిక్కవోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద కులగణన సర్వేపై శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కె.విజయకుమారి మాట్లాడుతూ వలంటీర్లు, సచివాలయం సిబ్బంది ద్వారా ఇంటింటా కులగణన సర్వే జరుగుతుందన్నారు. సర్వేకు అందరూ సహకరించాలని కోరారు. అనంతరం సర్వే తీరుపై అవగాహన కల్పించారు. కుల సంఘాల నాయకులు అడిగిన ప్రశ్నలకు తహసీల్దార్ పోసిబాబు సమాధానం చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో జేపీ ఝాన్సీ, కొంకుదురు సర్పంచ్ సత్తి వీరమణి, కొమరిపాలెం ఉపసర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

అనపర్తి: మండలంలోని రామవరంలో పైడితల్లి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి బుధవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గిరడా గంగాభవాని, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు ఆదాడి చినసత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

15 నుంచి నవదిన ప్రార్థనలు

మధురపూడి: క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ఈ నెల 15వ తేదీ నుంచి నవదిన ప్రార్థనలు నిర్వహించాలని రెవరెండ్ ఫాదర్లు మాణిక్యం, మనోజ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. 24వ తేదీ అర్ధరాత్రి క్రిస్మస్ వేడుకలు జరగనున్న నేపథ్యంలో తొమ్మిది రోజుల పాటు ఈ ప్రార్థనలు ఉంటాయన్నారు.


మళ్లీ జగన్ సీఎం కావాలని పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న గాలి గణేష్ బృందం

రాజానగరం: మళ్లీ జగన్ సీఎం కావాలన్న సంకల్పంతో విశాఖపట్నం నుంచి తిరుమలకు పాదయాత్ర చేస్తున్న వైఎస్సార్ అమరజ్యోతి స్టూడెంట్స్ అండ్ యూత్ ఫోర్స్ అధ్యక్షుడు గాలి గణేష్ బృందం బుధవారం రాజానగరం చేరుకుంది. గణేష్ 'సాక్షి'తో మాట్లాడుతూ వైఎస్సార్ అమలు చేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా ఆంధ్ర యూనివర్సిటీలో ఉన్నత విద్యను పొందగలిగానన్నారు. అందుకే ఆయనంటే తమకు వీరాభిమానమన్నారు. నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి సాగిస్తున్న ప్రజారంజక పాలనకు కూడా ఆకర్షితుడనై ఆయనే రెండోసారి కూడా ముఖ్యమంత్రి కావాలనే సంకల్పంతో వేంకటేశ్వరుని ప్రార్థిస్తూ ఈ పాదయాత్ర చేపట్టానన్నారు. డిసెంబరు 21 నాటికి తిరుమలకు చేరుకుంటామన్నారు.

వైభవంగా లక్షపత్రి పూజ



ఉమారామలింగేశ్వర స్వామివార్లకు లక్షపత్రి పూజ చేస్తున్న భక్తులు

సీతానగరం: స్థానిక శివాలయంలో ఉమారామలింగేశ్వరస్వామికి బుధవారం లక్షపత్రి పూజను వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి శ్యామలరావు, రాంబాబు ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, సూర్యనమస్కారం, పార్వతీ అమ్మవారికి లక్ష కుంకుమార్చన, జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. కార్తికమాసం సందర్భంగా పూజల అనంతరం రాత్రి 7 గంటల నుంచి అన్నసమారాధన జరిగింది.

ముంపు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే



ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: మిచాంగ్ తుపాను ప్రభావంతో మండలంలోని దుప్పలపూడిలో ముంపునకు గురైన వివిధ ప్రాంతాలను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి బుధవారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆయా ప్రాంత ప్రజలను కలుసుకున్న ఎమ్మెల్యే అందుతున్న సహాయక చర్యలపై ఆరా తీశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ అన్ని విధాలా సహకరించాలని అధికారులు, పోలీసు సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ వల్లభశెట్టి రామసతీష్, చిత్సారపు బాపిరాజు, కొండ సువర్ణబాబు, నందికోళ్ల ఆశీర్వాదం, మండ సత్యనారాయణ, ఎంపీడీఓ కె.హిమ మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



ముగ్గళ్ల ఎస్సీపేటలోకి చేరిన వర్షం నీరు



నాగంపల్లిలో పడిపోయిన వరి పంటను చూసుకుంటూ..



నరేంద్రపురం- నందరాడ రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షం నీరు

కల వరి పాట్లు

- ముంచేసిన మిచాంగ్
- పంట పొలాల్లో ముంపునీరు
- సహాయక చర్యలు ముమ్మరం



రాజానగరంలో నీటిలో నానుతున్న వరి పనలు

రాజానగరం: ఈదురుగాలులు.. ఆపై ఈదరగొట్టిన వర్షంతో ముంచుకొచ్చిన మిచాంగ్ తుపాను ప్రభావం నియోజకవర్గంలోనూ తీవ్రంగా ఉంది. మూడు రోజులుగా రాజానగరంలో 196.8 మి.మీ. వర్షపాతం నమోదు కాగా, మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకూ కుంభవృష్టిగా కురిసిన వర్షం 154.2 మి.మీ.గా నమోదైంది. అంటే తీవ్రత అర్థం చేసుకోవచ్చు. దీంతో పలు ప్రాంతాలు, రోడ్లు కాలువలను తలపించాయి. ఆయా ప్రాంతాల్లోకి నీరు రావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రైతులను ఈ వర్షాలు వణికించాయి. ఖరీఫ్ వరి పంట కోతలు ముగింపునకు చేరుకున్న దశలో అన్నదాతలకు కంటి మీద కునుకు లేకుండా చేశాయి. పక్వానికొచ్చిన పంటను కోసి, త్వరగా ఒబ్బిడి చేసుకోవాలనే ఆత్రుతతో నియోజకవర్గంలో సుమారు 525 ఎకరాల్లో వరి కోతలు కోసిన రైతులు ఆ వరి పనలను గట్టుకు చేర్చుకునే దారి కూడా లేక అవస్థ పడ్డారు. వర్షంతో పాటు **విపరీతంగా వీచిన గాలులకు సుమారు 165 ఎకరాల్లో కోతలకు సిద్ధంగా ఉన్న వరి పంట నేలకొరిగింది. పొలాల్లో వర్షం నీరు నిలిచిపోయింది. నందరాడ ఏపీ ట్యాంకు మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పొంగిపొర్లుతుంది. మురారి, కలవచర్ల మీదుగా పీడ బ్యాడీ కాలువ నుంచి వచ్చే ముంపు నీరు ఆ చెరువు** నుంచి అయ్యగార్లకు చేరుకుంటుంది. చెరువులో ముంపునీరు పోటెత్తడంతో ఎగువ నుంచి వచ్చే ముంపు దిగువకు వెళ్లే మార్గం లేక చాగల్నాడు కాలువ ద్వారా నరేంద్రపురం- నందరాడ ఆర్అండ్‌బీ రోడ్డును ముంచెత్తింది. దీంతో రోడ్డు పక్కన పాకలు వేసుకుని నివాసముంటున్న ఐదు కుటుంబాలు రోడ్డున పడ్డాయి. వారికి నరేంద్రపురంలోని ప్రభుత్వ పాఠశాలలో పునరావాసం కల్పించారు. నందరాడ చెరువులోకి ముంపునీరు వెళ్లే మార్గాలు మూసుకుపోవడంతో ఈ సమస్య ఏర్పడిందని తెలుసుకున్న తహసీల్దార్ పవన్ కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది ఆ ప్రాంతానికి వెళ్లి, మూసుకుపోయిన మార్గాలను తెరిపించి మార్గాన్ని సుగమం చేశారు.

సీతానగరం: వర్షానికి పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం, ముగ్గళ్ల, ఇనుగంటివారిపేట, కాటవరంలలో ఎస్సీ, బీసీ కాలనీలు ముంపులోకి వెళ్లాయి. ముగ్గళ్ల ఎస్సీపేటలో వర్షం నీరు ఇళ్లలోకి వచ్చిందంటూ ప్రజలు రోడ్డుపై ధర్నా చేశారు. దీంతో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, ఈవోపీఆర్డీ మూర్తి, ఎస్సై కె.చిరంజీవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అవినాష్, పంచాయతీ కార్యదర్శి సూర్యకుమారి, సచివాలయ మహిళా పోలీస్ టి.ప్రసన్న తదితరులు వెళ్లి ప్రొక్లెయిన్‌తో ఎస్సీపేట నుంచి నీరు వెళ్లే విధంగా చూడడంతో ఆందోళన విరమించారు. మోటార్లు ఏర్పాటు చేసి గ్రామాల నుంచి నీటిని తరలిస్తున్నారు. సుమారు 1,500 ఎకరాల్లోని వివిధ దశల్లో ఉన్న వర్జీనియా పొగాకు పంట ఎందుకు పనికి రాకుండా పోయింది. సుమారు 4 వేల ఎకరాల్లోని మొక్కజొన్న పంట, కూరగాయలు పాదులు, అరటి, బొప్పాయి, నాటు పొగాకు పంటలు సుమారు ఎనిమిది వేల ఎకరాలు వర్షాలతో పాడవుతున్నాయి.

గాడాలలో రెండు గేదెల మృతి

మధురపూడి: మిచాంగ్ తుపాను కారణంగా గాడాలలో మంగళవారం రాత్రి రెండు గేదెలు మృతి చెందాయి. ఈదురు గాలులతో కూడిన వర్షానికి దొడ్డ వెంకన్న గోశాల కూలిపోయింది. దీంతో గేదెలు మృత్యువాత పడినట్టు పంచాయతీ, పశు సంవర్ధక శాఖల అధికారులు తెలిపారు. విపరీతంగా కురుసిన వర్షానికి చెరువులు, కాలువలు నిండిపొర్లాయి. గాడాల - కోలమూరు మధ్య ఉన్న పొన్నాలమ్మ గుడి వద్ద రోడ్డుపై నీరు ప్రవహించింది.

నిండా ముంచిన తుపాను

చాగల్నాడు కాలువకు పలుచోట్ల గండి

రంగంపేట: మిచాంగ్ తుపాను నిండా ముంచింది. పల్లె, పట్టణమన్న తేడా లేకుండా అంతటా అతలాకుతలం చేసింది. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పలు ప్రాంతాల్లో వరి పొలాలు ముంపుబారిన పడ్డాయి. శనగ, మినుము, పెసర, నువ్వులు, కురగాయల పంటలకు నష్టం వాటిల్లింది. వేలాది ఎకరాలు ముంపుబారిన పడడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. మరోవైపు అధికార యంత్రాంగం శరవేగంగా సహాయక చర్యలు చేపట్టింది.

ముంపులో వేలాది ఎకరాలు

- రంగంపేట, వడిశలేరు, చంద్రేడు, పెదరాయవరం గ్రామాల్లో రైతులు రెండో పంటగా సుమారు 15 వందల ఎకరాల్లో శనగ పంట సాగు చేశారు. రెండు, మూడు నీటి తడులు తప్ప మంచుతో పెరిగే శనగ మొక్కలు గత నాలుగు రోజులుగా కురిసిన వర్షానికి పూర్తిగా నీటి మునిగాయి. ఎకరానికి సుమారు రూ.30 వేల వరకూ పెట్టుబడి పెట్టామని, అదంతా నీటిపాలేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- రంగంపేట మండలం పెదరాయవరం, వెంకటాపురం, దొడ్డిగుంట గ్రామాల్లో సుమారు 100 ఎకరాల్లోని చేతికందిన వరి పంట నీట పాలైంది. పెదరాయవరం వద్ద చాగల్నాడు కాలువకు పలుచోట్ల గండ్లు పడటంతో శనగ పొలాలు నీట మునగగా, వరి పనలు కొట్టుకుపోయాయి.
- వెంకటాపురం ఆత్రేయుడి చెరువు పొంగి పొర్లడంతో వెంకటాపురం, దొడ్డిగుంట గ్రామాల్లోని కోత కోసిన వరి పనలు నీటిలో కొట్టుకుపోగా, వరి కుప్పలు, ధాన్యం రాసులు నీట మునిగాయి.
- కోటపాడు, వెంకటాపురం, సింగంపల్లి, నల్లమిల్లి, దొడ్డిగుంట, దొంతమూరు గ్రామాల్లోని కూరగాయ పంటలు, ఉద్యాన పంటలు ఈదురు గాలులు, వర్షానికి నేలమట్టమయ్యాయి.

ముంపు ప్రాంతాల పరిశీలన

తుఫాన్ కారణంగా ముంపునకు గురైన పొలాలను తహసీల్దార్ ఎస్. దొరకయ్య, ఏఓ శ్రీనివాసరావు, ఉద్యాన అధికారి దివ్యశ్రీలు సందర్శించి రైతులకు పలు సూచనలిచ్చారు. చాగల్నాడు కాలువ గండ్లు పూడుస్తామని తహసీల్దార్ దొరకయ్య తెలిపారు. శనగ రైతులకు రాయితీపై విత్తనాలు అందిస్తామని ఏఓ శ్రీనివాసరావు తెలిపారు.

బిక్కవోలు: మిచాంగ్ తుపాను ధాటికి మండలంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పందలపాకలోని పంచాయతీ చెరువు నిండిపోవడంతో పక్కనే ఉన్న వీధులను ముంచెత్తింది. కట్లమ్మ తల్లి ఆలయం వరకూ నీరు రావడంతో స్థానిక నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



వెంకటాపురంలో నీట మునిగిన వరి పనలు చూపిస్తున్న రైతులు

బాధితులను ఆదుకుంటాం..

పెదపూడి: తుపాను వల్ల పంటలు దెబ్బతిన్న బాధిత రైతులను అన్నివిధాలా ఆదుకుంటామని, రైతులెవరూ ఆందోళన చెందొద్దని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి భరోసా కల్పించారు. బుధవారం ఆయన కరకుదురు, ఏపీత్రయం, రామేశ్వరం గ్రామాల్లో భారీ వర్షానికి తడిసిన ధాన్యపు రాసులను, నేలకొరిగిన పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. అధికారులు తక్షణం పంట నష్టాలపై అంచనాలు తయారు చేయాలని ఆదేశించారు. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులను ఆదుకోవడానికి కృషి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయంలోనే పంట నష్టపోయిన రైతులకు బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ సకాలంలో అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి.సుభాష్, ఏఓ మణిదీప్, ఎంపీపీ కేతా తులసి, వైస్ ఎంపీపీ కరెడ్ల వెంకన్నబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, సర్పంచ్ కొటికలపూడి చినబాబు, ఏపీత్రయం సొసైటీ చైర్మన్ గుండా ఈశ్వరరావు, గంగుమళ్ల ఈశ్వర వెంకట సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



పందలపాకలో చెరువు పొంగడంతో సమీప వీధుల్లోకి చేరిన నీరు



కరకుదురులో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

ఆందోళన వద్దు.. అండగా ఉంటాం..

- పంట నష్టంపై వివరాల సేకరణ
- బాధిత రైతులకు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా భరోసా

రాజానగరం: తుపాను ప్రభావంతో జరిగిన పంట నష్టంపై అధికారులు వివరాలు సేకరిస్తున్నారని, ఎవరూ ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. చేతికి అందివచ్చిన పంట నీటపాలైందని, బాధిత రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నదాతలకు ఆయన భరోసా ఇచ్చారు. అలాగే తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకుంటుందన్నారు. భారీ వర్షాలతో పునరావాసం కల్పించిన చోట జనాన్ని కంటికి రెప్పలా చూసుకోవాలని, అవసరమైన సహాయ, సహకారాలు అందించాలని నాయకులకు సూచించారు. అలాగే ఆయా ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఎమ్మెల్యే ఆదేశించారు.



మునగాలలో మునిగిన వరి కంకులను పరిశీలిస్తున్న జక్కంపూడి గణేష్ తదితరులు

ప్రభుత్వ పరిహారం అందిస్తాం..

మధురపూడి: మిచాంగ్ తుపాను కారణంగా కోరుకొండ మండలంలో నీట మునిగిన పంట పొలాలను వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కో-ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ పరిశీలించారు. మండలంలోని రైతులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను అన్నివిధాలా ఆదుకుంటుందని అధైర్య పడవద్దన్నారు. గోదావరి ఎగపోటు నీటి ముంపు గ్రామాలైన గుమ్ములూరు, బుచ్చెంపేట, మునగాల, కోటి, శ్రీరంగపట్నం, కోటి, జంభూపట్నం తదితర గ్రామాల్లో మొక్కజొన్న సాగుదారులతో ఆయన మాట్లాడారు. వరదనీటిలో మొక్కజొన్న మునిగిపోవడంతో పంట పనికి రాదన్నారు. ఇదే ప్రాంతంలో ధనియాల రైతులు పంట మొత్తం నీటమునగడంతో నష్టం వాటిల్లినట్టు వాపోయారు. పైగ్రామాలతో పాటు జంభూపట్నం తదితర గ్రామాల్లోని చేతికొచ్చిన వరి పంట నీట మునిగినట్టు ఆయన అన్నారు. రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకుని భరోసా ఇచ్చారు. కూరగాయల, తదితర పంటల రైతులతో గణేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పరిహారం అందరికీ అందేలా చూస్తామని అన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, ఏడీ మల్లికార్జునరావు, మండలాధికారి గౌరీదేవి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా కనకరాజు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జీవితం మార్గదర్శకం

- ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి
- ఘనంగా అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాలు

అనపర్తి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం మార్గదర్శకమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అంబేడ్కర్ 67వ వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల వికాసానికి పాటు పడిన అంబేడ్కర్ జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వారా కుమారి, ఉపసర్పంచ్ చిర్ల వీర్రాఘురెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, ఎంపీటీసీ కొండేటి భీమేష్, సుజాత, పాదూరి డేవిడ్‌రాజు, పెనుగొండ శ్రీను, ఇమ్మంది విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి: ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. గోకవరంలో బుధవారం వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఎమ్మెల్యే చంటిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని ఠాణా సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దాసరి రమేష్, నరాలశెట్టి నర్సయ్య, రౌతు జోగేశ్వరరావు, కర్రి శివరామకృష్ణ, బిజ్జి రాజు, మచ్చా మోహన్, తోలేటి రాంప్రసాద్, బి.వీరచంద్రం తదితరులు పాల్గొన్నారు.

ఆశయాలను కొనసాగిద్దాం

అనపర్తి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దామని అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని రామవరం పంచాయతీ కార్యాలయంలో ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, సర్పంచ్ గిరడా గంగాభవానిలు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు గొలుగూరి గౌతమి, నల్లమిల్లి భాగ్యలక్ష్మి, నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, రాజు పాల్గొన్నారు.

పెదపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఎంపీడీఓ వీవీ సాయిబాబు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, ఏఓ చలమయ్య పాల్గొన్నారు. కుమారప్రియంలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధాంతుల కొండబాబు, పెదపూడి ఎస్‌ఐ టి.రామకృష్ణ తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బిక్కవోలు: మండలంలోని పందలపాక సచివాలయం-1 వద్ద బుధవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి డిజిటల్ అసిస్టెంట్ సూరిశెట్టి సురేష్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వీఆర్వో ఓగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మహిళ సంరక్షణ కార్యదర్శి వెలగల విజయలక్ష్మి, ఏఎస్ఎం కె.అనంతలక్ష్మి పాల్గొన్నారు.

రంగంపేట: అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం వడిశలేరు ఎస్సీ కొత్తపేట కమ్యూనిటీ హాల్, పాత హరిజనపేటలో కుంతీదేవి గుడి వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో సర్పంచ్ బరగటి సుజాత, బరగటి నాగేశ్వరరావు, గంగరాజు పాల్గొన్నారు.

కోరుకొండ సెంటర్‌లో..


మధురపూడి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ అన్నారు. బుధవారం కోరుకొండ సెంటర్‌లో అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన గణేష్ మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ప్రపంచానికే మార్గదర్శకమన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు గొల్లపల్లి ప్రవీణ్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండల కన్వీనర్ ఉల్లి గణ, ఎస్సీ సెల్ మండల కో-కన్వీనర్ తాతపూడి చక్రవర్తి పాల్గొన్నారు.




'నన్నయ'లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

'నన్నయ' యూనివర్సిటీలో..


రాజానగరం: అణగారిన వర్గాల అభ్యున్నతికి శ్రమించిన మహోన్నతుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని యూనివర్సిటీలోని సెంట్రల్ లైబ్రరీ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ పాల్గొన్నారు.



కోరుకొండ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న జక్కంపూడి గణేష్



రామవరంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి



గోకవరంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

మౌలిక వసతుల కల్పనకు 'గ్రాసిం' కృషి



సామాజిక భవన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు బలభద్రపురంలోని గ్రాసిం ఇండస్ట్రీస్ అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక పాతవూరు బాపనమ్మ తల్లి గుడి వెనుక ఉన్న రజకుల వీధిలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి గ్రాసిం సంస్థ సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన నూతన భవనాన్ని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ సామాజిక బాధ్యతలో కార్పొరేట్ కంపెనీలు, పారిశ్రామిక సంస్థలు ముందుండాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తున్న గ్రాసిం సంస్థ యాజమాన్యం, ఉన్నతాధికారులకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గ్రాసిం సంస్థ హెచ్ఆర్ మురళీకృష్ణ, ఎంపీటీసీ కర్రి చినవెంకటరెడ్డి, అనపర్తి, పొలమూరు ఉపసర్పంచ్‌లు చిర్ల వీర్రాఘవరెడ్డి, సత్తి సూరారెడ్డి, సత్తి వెంకటరెడ్డి, గుంటూరు శ్రీను, యాసిడ్ రాము, తేతల రామకృష్ణారెడ్డి, తేతల దుర్గారెడ్డి, తాడి చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతునూ ఆదుకుంటాం

ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు




గోకవరంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: తుపాను ప్రభావంతో పంట నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. గోకవరం మండలంలో వర్షం కారణంగా పంట దెబ్బతిన్న వరి పొలాలను బుధవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. మోకాళ్ల లోతు నీటిలోకి ఎమ్మెల్యే స్వయంగా దిగి నీట మునిగిన వరి పొలాలను పరిశీలించారు. కళ్లాల్లో తడిచిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులెవ్వరూ అధైర్య పడవద్దని భరోసా ఇచ్చారు. తడిచిన, రంగు మారిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా పంట నష్టం వివరాలను నమోదు చేయాలని తహసీల్దార్ శ్రీనివాస్, వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. ఆయన వెంట సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, కర్రి శివరామకృష్ణ తదితరులు ఉన్నారు.

ఆడుదాం ఆంధ్రా క్రీడలను విజయవంతం చేద్దాం

అనపర్తి: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా క్రీడలను విజయవంతం చేద్దామని అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆడుదాం ఆంధ్రా క్రీడలకు సంబంధించిన కిట్లను ఏఎంసీ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ పులగం బుల్లిరెడ్డి చేతుల మీదుగా సర్పంచ్‌లు, కార్యదర్శులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి, ఈఓపీఆర్డీ కేయూఆర్ఎల్ పద్మజ, కొప్పవరం సర్పంచ్ కర్రి బుల్లిమోహన్‌రెడ్డి, ఏపీఎం జిలాని, సత్తి వెంకటరెడ్డి, లాజర్‌బాబు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కిట్ల అందజేత



ఆడుదాం ఆంధ్రా స్పోర్ట్స్ కిట్లను అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

బిక్కవోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మండల ప్రత్యేక అధికారి కె.విజయకుమారి ఆడుదాం ఆంధ్రా స్పోర్ట్స్ కిట్లను పంచాయతీ కార్యదర్శులకు బుధవారం అందజేశారు. కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వలంటీర్లు మండలంలోని 47,632 మందిని సర్వే చేయాల్సి ఉండగా ఇప్పటికి 38,533 మందిని సర్వే చేశారన్నారు. ఇప్పటికే 3,732 మంది నమోదు చేయించుకున్నారని చెప్పారు. అత్యధికంగా కొమరిపాలెం గ్రామం నుంచి 630 మంది నమోదు చేయించుకున్నారన్నారు. ఈ నెల 13 వరకూ నమోదుకు అవకాశం ఉందన్నారు. అనంతరం స్పోర్ట్స్ కిట్లను పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జేపీ ఝాన్సీ, తహసీల్దార్ కె.పోసిబాబు, కొమరిపాలెం ఉపసర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

కంబాలచెరువు: స్థానిక చొడేశ్వర్‌నగర్‌కు చెందిన కట్టా కుమార్ (44) అదృశ్యంపై స్థానిక మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. తన తమ్ముడు ఈ నెల 3వ తేదీ నుంచి కనిపించడం లేదని అన్నయ్య రవి పోలీసులకు ఫిర్యాదు చేశారు.